మంగళవారం 10 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

11న జాబ్‌మేళా

ప్రజాశక్తి-సీతంపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న సీతంపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదువుకొని, 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల యువత హాజరుకావాలని సూచించారు. జాబ్‌మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 63012 75511, 79937 95796 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మీరు చదవండి.. మేం చేయూతనిస్తాం

జీవితంలో ఏస్థాయికి చేరినా వ్యక్తిత్వాన్ని కాపాడుకోండి ● షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

'పేదరికం నుంచి బయటపడటానికి చదువే ఏకైక మార్గం. జీవితంలో ఏం కోల్పోయినా చదువును ఎవరూ దూరం చేయలేరు. మీరంతా కష్టపడి బాగా చదవండి. మీకు ప్రభుత్వం అండగా ఉంటుంద'ని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసానిచ్చారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డులను సోమవారం పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్లో విద్యార్థులకు మంత్రి ప్రదానం చేశారు. జిల్లాలో పదోతరగతిలో 95 మంది, ఇంటర్మీడియట్‌లో 26 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 15 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను సందర్శిస్తానని వెల్లడించారు. అన్నిరంగాల్లో ఏపి నంబర్ వన్‌గా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. రాబోయే రెండేళ్లలో ఏపి మోడల్‌ను ప్రపంచానికి చూపిస్తామని తెలిపారు.

అనంతరం విద్యార్థులతో లోకేష్ ముచ్చటించారు. వారడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. రాజకీయాల్లో స్ఫూర్తినిచ్చింది ఎవరు? అని కురుపాం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి రిషిత అడిగినప్పుడు లోకేష్ సమాధానమిస్తూ... నిత్యం రాష్ట్రం కోసం పరితపించే సిఎం చంద్రబాబునాయుడు వద్ద చాలా ఆలోచనలు ఉంటాయని, ఆయన వద్ద చాలా నేర్చుకుంటానని చెప్పారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి నుంచి కూడా స్ఫూర్తి పొందానని తెలిపారు. ఈ సందర్భంగా డ్రీమ్ వాల్, యాంబిషన్ వాల్, గ్రాటిట్యూడ్ వాల్‌పై విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తీకరించారు. వాల్స్‌పై విద్యార్థులు రాసిన మనోభావాలను ఆసక్తిగా చదివిన లోకేష్... విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీనిచ్చారు.

అనంతరం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్త, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి లోకేష్

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మరో ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు సిఫార్సులు

మరో ఏడాదిలో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు సిఫారసు చేసే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వ విద్యను ఇంకా ముందుకెళ్లడానికి కలసికట్టుగా పనిచేద్దాం. ఎపిలో చిట్టచివరి, అత్యంత వెనుకబడిన జిల్లా పార్వతీపురం మన్యం. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధిస్తుందని ఎవరూ ఊహించరు. గత ఐదేళ్లలో దుర్మార్గ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో 4,500 కోట్లు దుర్వినియోగం చేసింది. భవనాలు పాడు చేశారు. అసంపూర్తిగా వదిలేశారు. డబ్బు ఖర్చుపెట్టి స్కూళ్లు ఎత్తేశారు. అనాలోచిత నిర్ణయాలతో సమస్యలు వచ్చాయి.

- కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

గిరిజన పాఠశాలలోనే చదివా

అభివృద్ధిలో వెనకబడ్డా విద్యలో మన్యం జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. 8 గిరిజన మండలాల్లో ఫోన్ సిగ్నల్స్ సరిగా రావడం లేదు. ఇంటర్నెట్ సమస్య లేకుండా చూడాలి. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో కడుపునింపిన ఘనత మంత్రి లోకేష్‌దే. జోగంపేట స్కూల్లో ఇద్దరు ఐఐటి, ముగ్గురు ఎన్ఐటి సీట్లు సాధించారు. చదువుకొని సాధించాలన్న పట్టుదల మా విద్యార్థులకు ఉంది. ప్రోత్సాహం ఇస్తే ఉన్నత స్థానానికి చేరుతారు. నేను గిరిజన పాఠశాలలో చదువుకొని ఈస్థాయికి వచ్చా. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తక్కువగా ఉన్నాయి, నియోజకవర్గానికి ఒక బాలికల జూనియర్ కాలేజి మంజూరు చేయాలి.

-గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి

రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి

ఏరియా ఆస్పత్రి కిటకిట

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఇటీవల కురిసిన వర్షాలు, కొత్తనీరు తాగడం, ఎండల తీవ్రతతో దోనుబాయి, కుసిమి పరిసర ప్రాంతాల్లో మలేరియా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో సోమవారం సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఒపి 403 వచ్చింది. ఇన్ పేషెంట్లు 46, జ్వరాలు 78, మలేరియా కేసులు 26 ఉన్నట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఏడాది పాలనలో అరాచకాలే

అసమర్థ హోంమంత్రి క్షమాపణ చెపుతారా? : మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-పార్వతీపురం

టిడిపి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి విమర్శించారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటీవల అనంతపురంలో తన్మయి అనే విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన ఘటనపై పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తన్మయి కనబడలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. 14 మంది టిడిపి కార్యకర్తలు అత్యాచారం చేసి, హత్య చేసినా ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నారు. పోలీసు వ్యవస్థ ప్రజల మాన, ప్రాణ రక్షణ కోసం పని చేయడం లేదని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడానికే పోలీసు వ్యవస్థని ప్రభుత్వం వినియోగిస్తోందని ఆరోపించారు. మహిళా హోంమంత్రి అనిత హయాంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని చెప్పారు. ముక్కుపచ్చలారని పసిపిల్లలపై కూడా అఘాయిత్యాలు జరిగాయని వాపోయారు. మహిళల ఆత్మగౌరవం.. అంటూ గొంతు చించుకుంటున్న హోంమంత్రి అనిత ఎందుకు క్షమాపణ చెప్పడం లేదని ప్రశ్నించారు.

కొమ్మినేని అరెస్టు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం ఏడాది పాలనలో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికేనని పుష్పశ్రీవాణి అన్నారు. ఇటీవల ఒక టివి డిబేట్‌లో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఈ వ్యాఖ్యలని వైసిపి నాయకత్వం కూడా ఖండించిందని చెప్పారు. అలాంటప్పుడు ఈ వ్యవహారంలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిలను నిందించడం తగదన్నారు.

పార్వతీపురంలో నిరసన చేపడుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లై, విద్యుత్ దీపాల నిర్వహణ విభాగంలో పనిచేసే కార్మికులు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 9 నుండి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్తామని ఇప్పటికే కార్మికులు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యానికి గురైన కార్మికులకు ఐదు లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టి.వినయ్, బి.ఉమామహేశ్వరరావు, వై.శంకర్రావు, ఎం.రమేష్, బి.జగదీష్, పి.రమేష్, అప్పలరాజు, బాల, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్

సాలూరు రూరల్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ వరప్రసాద్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు బకాయిలు ఉన్న వేతనాలను, పెంచాల్సిన వేతనాలను, టిఎ, డిఎ ఇస్తామని, అన్ని రకాల మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ఆ డిమాండ్ల కోసం సమ్మె నోటిస్ ఇచ్చిన నాటి నుండి 14 రోజుల్లోపు ఎప్పుడైనా సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అమర్, దుర్గాప్రసాద్, వాటర్ వర్కర్ సీనియర్ నాయకులు రాముడు, శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో వినతి అందిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు, ఫెడరేషన్ నాయకులు

ఇంటి వద్దకే రేషన్ అందించాలి

సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనుల ధర్నాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేదని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎండియు వాహనాలు రద్దు చేయడం వల్ల ఏజెన్సీలో గిరిజనులు ప్రతి నెలా రేషన్ కోసం మూణ్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న డిఆర్ డిపోలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కూలి పనులు మానుకొని వెళుతున్న గిరిజనులు, వృద్ధులు, వికలాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్యను గుర్తించి నేరుగా గిరిజనుల వద్దకే రేషన్ సరుకులు అందే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బిడ్డిక ఆడిత్తు, ఎం.సన్యాసిరావు, శ్రీనివాసరావు, మహేష్, నరేష్, టి.కమల, ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.

సీతంపేట : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఎండియు వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజనులు డిపోలకు రావాలంటే ఐదారు కిలోమీటర్ల మేర కొండల ప్రాంతం నుంచి నడిచి రావాల్సి వస్తోందని, దీంతో ఒక పూట లేక ఒక రోజు పనివృథా అవుతుందని తెలిపారు. గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. కొండ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టా భూముల్లో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటుతామంటూ గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మొక్కలు నాటాలంటే రోడ్డు పక్కన లేదా హైవే పక్కన నాటాలని సూచించారు. భూమిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ అప్పలరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కరరావు, సాంబయ్య, శ్రీరాములు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఎండియు వాహనాలను గిరిజన ప్రాంతాలలో కొనసాగించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శకుంతలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ ఎండియు వాహనాలను తొలగించడం వల్ల ప్రధానంగా గిరిజన గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. పాలెం పంచాయతీ రావికోన, కుస్తూర్ గ్రామస్తులు రేషన్ డిపోకు వెళ్లి, రావాలంటే బియ్యం రేటు కన్నా పది రెట్లు డబ్బులు చెల్లించి, ఆటోల ద్వారా రేషన్ తీసుకెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. ఆరేడు కిలోమీటర్లు కొండ ప్రాంతంలో నడిచివెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, గిరిజన సంఘం నాయకులు గణేష్, ప్రభు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారానే రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గమ్మెల జానకిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

గుమ్మలక్ష్మీపురంలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఉపాధ్యాయుల నిరసన దీక్ష

మాన్యువల్ కౌన్సిలింగ్ కోసం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీల్లో మాన్యువల్ కౌన్సిలింగ్ చేపడతామని ప్రభుత్వం ఇచ్చిన హామీనీ అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. వెబ్ కౌన్సిలింగ్ వద్దని, మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించు కోకపోవడం సరికాదన్నారు. ఉద్యోగి వ్యతిరేక ప్రభుత్వంగా మారొద్దని, తామేమి గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. మాన్యువల్ కౌన్సిలింగ్ ప్రకటించే వరకు వెబ్ కౌన్సిలింగ్ లో ఉపాధ్యాయులు పాల్గొనేది లేదని తెలిపారు. నిరసన దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రమేష్ చంద్ర పట్నాయక్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ (1938) నాయకులు డి.ఈశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్‌టియు నాయకులు కె.జోగారావు, సూరిబాబు, డి.శ్యామ్, ఎపిటిఎఫ్ 257 నాయకులు కె.శ్రీనివాసరావు, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు గణపతిరావు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో ఏనుగుల గుంపు తిష్టవేసింది. సోమవారం కోట సీతారాంపురం, పి.పుచ్చంపేట వెళ్లే మార్గంలో తోటలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది కోరారు.

వసతిగృహాలకు చేరిన సన్నబియ్యం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలలకు, ఏకలవ్య పాఠశాలలకు సోమవారం సన్న బియ్యం చేరాయి. 25 కిలోల బస్తాలతో మధ్యాహ్న భోజనం పథకం పేరుతో బియ్యం వచ్చాయి. ఈ ఏడాది నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్టు ఎంఇఒలు శ్రీనివాసరావు, ఊరిక భాస్కరరావు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా నోట్ బుక్స్, బ్యాగులు, షూ, యూనిఫాం, పాఠ్యాంశ పుస్తకాలతో కూడిన కిట్లు కూడా చేరాయని తెలిపారు.

నాగేశ్వరరావును సత్కరిస్తున్న మాజీమంత్రి బాబూ మోహన్

ప్రకృతి వ్యవసాయ రైతుకు సత్కారం

ప్రజాశక్తి-సీతంపేట

పిపి ఈతమానుగుడ పంచాయతీ పరిధిలో బిల్లమాడ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పాలక నాగేశ్వరరావును హైదరాబాద్‌లో నవనిర్మాణ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నాల రాంబాబు, మాజీ మంత్రి బాబూ మోహన్, సినీ నటి కవిత చేతుల మీదుగా సన్మానించారు. ఏరువాక అగ్రి ఎక్స్‌లైన్స్ అవార్డును ప్రదానం చేశారు. కొత్తూరు ఏరియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ ప్రకృతి వ్యవసాయంపై ఆదివాసీ రైతులకు అవగాహన కల్పించడంతో ఆయన్ను సత్కరించారు.

పెట్టుబడి సాయం విడుదల చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలురైతులకు తక్షణమే పెట్టుబడి సాయం విడుదల చేయాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భామిని.. గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు శివకుమార్

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమం సోమవారం నిర్వహించి, గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రిజం-10 గురించి అవగాహన కల్పించారు. మాత, శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చుతగ్గులు గుర్తించి, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జయగౌడ్, నాగమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం వైద్యాధికారులు బి.ప్రదీప్ కుమార్, ఎ.మానస గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, తదితర రకాల ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు. మందులు పంపిణీ చేశారు. నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : బాలేరు పిహెచ్‌సిలో వైద్యులు శివకుమార్ ఆధ్వర్యంలో 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను అందజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పోషక ఆహారంపై, మందుల వినియోగంపై అవగాహన కలిగించారు. సోలికిరి సత్యసాయి ట్రస్ట్ సిబ్బంది గర్భిణులకు భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో బాలేరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో నాయుడుమల్లి ప్రతిభ కళాశాల, గురుకుల పాఠశాల, ముత్యాలు సింహం పాఠశాల, హాస్టల్‌లో ఐఆర్ఎస్ ద్రావణాన్ని సోమవారం స్ప్రేయింగ్ నిర్వహించారు. దీనిని జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ పరిశీలించారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా స్ప్రేయింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివశంకర్, ఎంఎఒ శ్రీనివాసరావు, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంఒ సత్యనారాయణ

లోకేష్ టూర్.. అంతా షో

సీనియర్ నాయకులకు నిరాశ ● భేటీ లో సమస్యలు చెప్పకునే ఛాన్స్ ఇవ్వని యువనేత

ప్రజాశక్తి-పార్వతీపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పర్యటన షో మాదిరిగా సాగింది. ఆయన పట్టణానికి రాగానే రాయల్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటుచేసిన షైనింగ్ స్టార్స్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మీడియా ప్రతినిధులకు ప్రవేశం లేకుండా చేశారు. మీడియా ప్రతినిధులకు ఎంట్రీ పాసులిచ్చి బయటే ఉండిపోమన్నారు. అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని కూడా రహస్యంగా నిర్వహించడం చర్చనీయాంశమైంది. తర్వాత మండలంలోని చినబొండపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ అంతరంగిక సమావేశంలోనూ పాల్గొన్న లోకేష్ అక్కడకు హాజరైన ముఖ్య నాయకుల సమస్యలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. రహస్య భేటీలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని యువనేత లోకేష్‌కి చెప్పుకునే అవకాశం దొరుకుతుందని సీనియర్ నాయకులు గంపెడాశతో వెళ్ళారు. కనీసం అసంతృప్తి నాయకుడితో కూడా మాట్లాడించలేదు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు అనుకూలంగా ఉన్న ముగ్గురు మండల నాయకులతో మాట్లాడటానికి అవకాశం ఇవ్వడంతో వారు ఎమ్మెల్యే బోనెలని పొగడ్తలతో ముంచెత్తారు. సుమారు 600 మంది బూత్ కమిటీ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, సీనియర్ నాయకులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. కానీ ఏ ఒక్కరి కష్టసుఖాలు కూడా అడగపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏడాది పాలనలో తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవాలని అనేకమంది ముఖ్య నాయకులు భావించారు. కానీ యువనేత లోకేష్ పర్యటన షో మాదిరిగా సాగింది.

మంత్రి లోకేష్‌తో కరచాలనం చేసేందుకు ఎగబడుతున్న టిడిపి శ్రేణులు

టిడిపి కేడర్ అసంతృప్తి

మండలంలోని చినబొండపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల రహస్య భేటీలో యువనేత లోకేష్ నియోజకవర్గం నుంచి ఎంపిక చేసిన 61 మంది సీనియర్ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అయితే వీరిలో చాలామంది వైసిపి నుంచి ఈమధ్య కాలంలో టిడిపిలో చేరిన వారే ఉండటంతో అధికార పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు ఇవ్వకుండా వైసిపి నుంచి కొత్తగా పార్టీ తీర్థం పుచ్చుకున్న వారికి లోకేష్‌తో సన్మానం చేయించడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై కొంతమంది టిడిపి కార్యకర్తలు.. పార్టీ మండల అధ్యక్షులను నిలదీసినట్లు తెలిసింది.

లోకేష్‌ని కలిసిన మాజీలు

మంత్రి లోకేష్‌ని మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ కలిశారు. రాయల్ కన్వెన్షన్ హాల్ వద్ద టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్.. లోకేష్‌కి పుష్పగుచ్ఛం అందజేశారు. చినబొండపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ కలిశారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పార్వతీపురం రూరల్ : అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా చిత్తశుద్ధితో ఉందన్నారు. ఏడాదిలో పింఛన్ల పెంపుదలతోపాటు రహదారుల మరమ్మతులు, ఉద్యోగుల జీతాలు, ఉపాధి హామీ పాత బకాయిలు చెల్లింపులు వంటి వాటిని నిర్వహించామన్నారు. అయితే ఈ విషయాలపై కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం లేదన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంలో అధికారుల అలసత్వంపై ఫిర్యాదులు వస్తున్నాయని, దీన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి నెల రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రకారం పార్వతీపురం పట్టణానికి రక్షిత మంచినీరు సరఫరాతో పాటు జంఝావతి, ఆడారు జలాశయాలను పూర్తి చేయడానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిసిసి చైర్మన్ కె.శ్రావణ్ కుమార్, మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడారు.

దరఖాస్తులు పునరావృతం కాకూడదు

- డిఆర్‌డిఎ పీడీ సుధారాణి
- పిజిఆర్ఎస్‌కు 44 అర్జీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే దరఖాస్తులు పునరావృతం కాకూడదని డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, కచ్చితమైన పరిష్కారం చూపించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఇ- సెక్షన్ సూపరింటెండెంట్ జి.శ్రీరామ్మూర్తితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ పిజిఆర్ఎస్‌కు 44 దరఖాస్తులు అందాయి.

పిజిఆర్ఎస్ దరఖాస్తుల్లో కొన్ని...

- జియ్యమ్మవలస మండలం అర్నాడవలస గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని, వర్షాకాలంలో పిల్లలు స్కూల్‌కి వెళ్లలేకపోతున్నారని, తమగ్రామానికి రోడ్డు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎం.సురేష్ అర్జీ అందజేశారు.
- విశాఖ డెయిరీ కంపెనీ 21 మంది పాడి రైతులకు బోనస్ చెల్లించినప్పటికీ, పాచిపెంట గ్రామ ఏజెంట్ నిలుపుదల చేశారని, దీనిపై దర్యాప్తు చేసి, బోనస్ ఇప్పించాలని మహంతి తవిటినాయుడు, ఇతరులు దరఖాస్తు సమర్పించారు.
- పార్వతీపురం పట్టణం బెలగాంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వీధిలో చెత్త కుండి ఏర్పాటు చేయడం వల్ల పందులు సంచరిస్తున్నాయని, వాటివల్ల ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారని, పందుల బారి నుండి ప్రజలను రక్షించాలని గిరి పట్నాయక్, ఇతరులు దరఖాస్తు అందజేశారు.
- మక్కువ మండలం ఎర్రసామంతవలస గ్రామానికి చెందిన ఆర్.పార్వతమ్మ సర్వే నెంబర్ 101లోని భూమిని 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నానని, ఆ భూమిని వేరే వారు ఆక్రమించుటకు చూస్తున్నారని, ప్రభుత్వం రీ సర్వే చేపట్టి, ఆన్‌లైన్ చేసి పాస్ బుక్ మంజూరు చేయాలని కోరారు.
- జియ్యమ్మవలస మండలం బిత్తరపాడు గ్రామానికి చెందిన ఎ.స్వాతి తన కుమారుడికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతికి సీట్ ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.
- పార్వతీపురం మండలం జమ్మిడివలస గ్రామానికి చెందిన అల్లు కుమారి వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.
- మక్కువ మండలం చెముడు గ్రామానికి చెందిన జి.మోహనరావు కొత్త రేషన్ కార్డ్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- సీతంపేట మండలం సీతంపేట గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు సర్వే నెంబర్ 8-1, 8-2లో 726.82 ఎకరాల విస్తీర్ణం కలిగిన జిరాయతీ భూమికి రీ సర్వే చేపట్టి, వన్‌బి మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, ఉద్యానవన శాఖ అధికారి బి.శ్యామల, జిల్లా గ్రామీణాబివృద్ధి సంస్థ ఎపిడి సత్యంనాయుడు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 23 వినతులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 23 వినతులు వచ్చాయి. సోమవారం ఎపిఒ చినబాబు ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ముత్యాలు చెందిన సవర శేఖర్ ఏరియా హాస్పిటల్‌లో ఎంపిహెచ్ఒ పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. సిడిగూడ చెందిన బెనర్జీరావు సవరభాష వాలంటీర్ పోస్టు ఇప్పించాలని కోరారు. అంటికొండకు చెందిన సుందర్ రావు 9 వారాల ఉపాధి వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్నకుమార్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, సిడిపిఒ రంగలక్ష్మి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ చినబాబు

యోగా జీవితంలో భాగం కావాలి

సీతంపేటలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు

యోగాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

యోగా మనిషి జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో సోమవారం యోగా డే నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి ఎల్విన్‌పేట జంక్షన్ వరకు యోగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యవంతులుగా జీవించాలంటే దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ ఎన్.శేఖర్, పంచాయతీ, సచివాలయ, ఐసిడిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. నడిమికెళ్ల, వండువ గ్రామాల్లో కూడా ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆర్.ఆనందరావు, మేజర్ పంచాయతీ ఇఒ కోటేశ్వరరావు, జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు

గుమ్మలక్ష్మీపురంలో యోగా అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి : దైనందిన జీవనశైలిలో యోగా భాగం కావాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, గృహ నిర్మాణ శాఖ జెఇ వంగపండు అఖిల్ నాయుడు, వెలుగు ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మరిశర్ల భాస్కరరావు, సిసిలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వడిశాపు లక్ష్మణరావు, తోయక చంద్రమోహన్, మరియదాసు, కొప్పర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాలలో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పయ్యపేటలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

సీతంపేట : సీతంపేట గ్రామ సచివాలయం నుండి ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు వరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు ర్యాలీలో మండల ప్రత్యేక అధికారి చిన్న బాబు మాట్లాడుతూ యోగాంధ్ర గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిబి మిశ్రో, డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, ఎపిఎం కమల, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని నిరసన

నిరసన చేపడుతున్న ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌కి, అధికారులకు ఎన్నిసార్లు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, గ్లౌజులు , మాస్కులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని, చెత్తబళ్లకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. దానివల్ల కార్మికులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, అధికారులు స్పందించి సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాగు, శంకర్రావు, మామిడి శివ, బంగారు రాజేష, విప్పలమ్మ, కాపులమ్మ, గంగయ్యలు, గంగరాజు, రాజేషు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పాలకొండ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 50/2022

వాది :- ఉగ్రాకుల దుర్గారావు
ప్రతివాదులు:- చింతాడ దమయంతి వగైరాలు

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన D2 చింతాడ నిర్మలారాణి తండ్రి లేటు సింహాచలం, నడిమికెల్ల గ్రామము, వీరఘట్టాం మండలం హాజరు నిమిత్తం కోర్టువారు తే 24-06-2025దికి వాయిదా వేసినారు. కావున మీరు **తే24-06-2025దీన ఉదయం 10-30ని॥లకు** స్వయముగా కాని, వకీలు ద్వారా కాని కోర్టుకు హాజరు కావలసినదిగా కోర్టువారు నిర్ణయించినారు. లేని పక్షములో మీపైన వారు వేసిన దావా మీకు పరోక్షముగా తీర్మానించబడును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కె.వి.రమణమూర్తి
వాది తరుపు న్యాయవాది,
పాలకొండ, పాలకొండ
తేది: 9-6-2025 సెల్ : 9440001701

మహారాజశ్రీ పాలకొండ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 125/2022 in OS 50/2022

పిటిషనరు - వాది:- ఉగ్రాకుల దుర్గారావు
రెస్పాండెంట్లు-ప్రతివాదులు :-
చింతాడ దమయంతి వగైరాలు

పై నెంబరు పిటిషన్‌లో రెండువ రెస్పాండెంటు అయిన చింతాడ నిర్మలారాణి తండ్రి లేటు సింహాచలం, నడిమికెల్ల గ్రామము, వీరఘట్టాం మండలం హాజరు నిమిత్తం కోర్టువారు తే 24-06-2025దికి వాయిదా వేసినారు. కావున మీరు **తే24-06-2025దీన ఉదయం 10-30ని॥లకు** స్వయముగా కాని, వకీలు ద్వారా కాని కోర్టుకు హాజరు కావలసినదిగా కోర్టువారు నిర్ణయించినారు. లేని పక్షములో మీపైన వారు వేసిన దావా మీకు పరోక్షముగా తీర్మానించబడును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కె.వి.రమణమూర్తి
పిటిషనరు తరుపు న్యాయవాది,
పాలకొండ, పాలకొండ
తేది: 9-6-2025 సెల్ : 9440001701